16-08-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - విదేహీ తండ్రినైన నేను దేహధారులైన మిమ్మల్ని విదేహీగా తయారుచేయడానికి చదివిస్తాను, ఇది కొత్త విషయము, దీనిని పిల్లలు మాత్రమే అర్థం చేసుకుంటారు"

ప్రశ్న:- బాబా ఒకే విషయాన్ని పదే-పదే అర్థం చేయించాల్సిన అవసరం ఎందుకు వస్తుంది?

జవాబు:- ఎందుకంటే పిల్లలు ఘడియ-ఘడియ మర్చిపోతారు. కొంతమంది పిల్లలు ఏమంటారంటే - బాబా అయితే అదే విషయాన్ని పదే-పదే అర్థం చేయిస్తారు. బాబా అంటారు - పిల్లలూ, నేను తప్పకుండా అదే విషయాన్ని వినిపించాల్సి వస్తుంది ఎందుకంటే మీరు మర్చిపోతారు. మిమ్మల్ని మాయా తుఫానులు హైరానా పరుస్తాయి, ఒకవేళ నేను రోజు అప్రమత్తం చేయకపోతే మీరు మాయా తుఫానులతో ఓడిపోతారు. ఇప్పటివరకు మీరు సతోప్రధానంగా ఎక్కడ అయ్యారు? ఎప్పుడైతే అలా తయారవుతారో, అప్పుడు వినిపించడం ఆపేస్తాను.

ఓం శాంతి. దీనిని విచిత్రమైన ఆత్మిక చదువు అని కూడా అంటారు. కొత్త ప్రపంచమైన సత్యయుగంలో కూడా దేహధారులే ఒకరినొకరు చదివిస్తారు. జ్ఞానమునైతే అందరూ చదివిస్తారు. ఇక్కడ కూడా చదివిస్తారు. అక్కడ అంతా దేహధారులు ఒకరినొకరు చదివిస్తారు, విదేహీ అయిన తండ్రి లేక ఆత్మిక తండ్రి చదివించడమనేది ఎక్కడా జరగదు. శాస్త్రాలలో కూడా శ్రీకృష్ణ భగవానువాచ అని వ్రాసేసారు. వారు కూడా దేహధారి అయినట్లే. ఈ కొత్త విషయాన్ని విని తికమకపడతారు. ఆత్మిక తండ్రి ఆత్మలైన మిమ్మల్ని చదివిస్తున్నారు అని మీలో కూడా నంబరువారు పురుషార్థానుసారముగా అర్థం చేసుకుంటారు. ఇది కొత్త విషయము. కేవలం ఈ సంగమములోనే తండ్రి స్వయంగా వచ్చి, వీరి ద్వారా నేను మిమ్మల్ని చదివిస్తాను అని అంటారు. జ్ఞాన సాగరుడు, శాంతి సాగరుడు, సర్వాత్మల తండ్రి కూడా వారే. ఇది అర్థం చేసుకోవలసిన విషయం కదా. ఇది కళ్ళకు ఏమీ కనిపించదు. ఆత్మయే ముఖ్యమైనది మరియు అది అవినాశీ. శరీరమైతే వినాశీ. ఇప్పుడు ఆ అవినాశీ ఆత్మ కూర్చొని చదివిస్తారు. ఇక్కడైతే సాకారములో శరీరం ఉంది అన్నట్లుగా మీరు ఎదురుగా చూస్తూ ఉంటారు కానీ ఈ జ్ఞానాన్ని దేహధారి ఇవ్వడం లేదని మీకు తెలుసు. జ్ఞానాన్ని ఇచ్చేవారు విదేహీ అయిన తండ్రి. ఎలా ఇస్తారు? అది కూడా మీరు అర్థం చేసుకున్నారు. మనుష్యులైతే అతి కష్టం మీద అర్థం చేసుకుంటారు. ఈ నిశ్చయము ఏర్పరిచేందుకు మీరు ఎంతగా కష్టపడవలసి వస్తుంది. వారైతే నిరాకారునికి నామ, రూప, దేశ కాలాలేవీ లేవు అని అనేస్తారు. ఆ తండ్రి స్వయంగా కూర్చొని చదివిస్తారు. నేను సర్వాత్మలకు తండ్రిని, నన్ను మీరు చూడలేరు అని అంటారు. వారు విదేహీ అని మీరు అర్థం చేసుకుంటారు. వారు జ్ఞానం, ఆనందం, ప్రేమ యొక్క సాగరుడు. వారు ఎలా చదివిస్తారు. నేను ఎలా వస్తాను, ఎవరిని ఆధారంగా తీసుకుంటాను అన్నది తండ్రి స్వయంగా అర్థం చేయిస్తారు. నేను గర్భం ద్వారానేమీ జన్మ తీసుకోను. నేను ఎప్పుడూ మనిషిగా లేక దేవతగా అవ్వను. దేవతలు కూడా శరీరము తీసుకుంటారు, నేనైతే ఎల్లప్పుడూ అశరీరిగానే ఉంటాను. నేను ఎప్పుడూ పునర్జన్మలలోకి రాను, నాకు మాత్రమే డ్రామాలో ఈ పాత్ర ఉంది. ఇది అర్థం చేసుకోవలసిన విషయం కదా. చూసేందుకైతే అసలు కనిపించరు. వారైతే శ్రీకృష్ణ భగవానువాచ అని భావిస్తారు. భక్తి మార్గంలో కూడా ఎటువంటి రథాన్ని కూర్చుని తయారుచేసారు. తండ్రి అంటారు - పిల్లలూ, మీరు తికమకపడడం లేదు కదా? ఒకవేళ ఏదైనా అర్థం కాకపోతే వచ్చి తండ్రి ద్వారా అర్థం చేసుకోండి. నిజానికి అడగకుండానే తండ్రి అన్నీ అర్థం చేయిస్తూ ఉంటారు. మీరు ఏమీ అడగవలసిన అవసరం లేదు. నేను ఈ పురుషోత్తమ సంగమయుగంలోనే అవతారం తీసుకుంటాను. నా జన్మ కూడా అద్భుతమైనది. పిల్లలైన మీకు కూడా అద్భుతమనిపిస్తుంది, ఎంత పెద్ద పరీక్షను పాస్ చేయిస్తారు. విశ్వానికి అతి పెద్ద యజమానులుగా తయారుచేయడానికి చదివిస్తారు. అద్భుతమైన విషయం కదా. ఓ ఆత్మల్లారా, ప్రతి 5 వేల సంవత్సరాల తర్వాత నేను మీ సేవ కోసం వస్తాను. ఆత్మలను చదివిస్తారు కదా. కల్ప-కల్పము, కల్పం యొక్క సంగమయుగములో మీ సేవ కోసం వస్తాను. ఓ బాబా, ఓ పతిత-పావనా రండి అని అర్ధకల్పము మీరు పిలుస్తూ వచ్చారు. శ్రీకృష్ణుడిని పతిత-పావనా అని ఎవ్వరూ అనరు. పతిత-పావనా అని పరమపిత పరమాత్మనే అంటారు. కావున పతితులను పావనులుగా చేయడానికి బాబా కూడా రావలసి ఉంటుంది, అందుకే అకాల్ మూర్త్ - సత్యమైన బాబా, అకాల్ మూర్త్ - సత్యమైన టీచరు, అకాల్ మూర్త్ - సద్గురువు అని అంటారు. సిక్కులవి కూడా ఎంతో మంచి స్లోగన్లు ఉన్నాయి. కానీ సద్గురువైన అకాల్ మూర్త్ ఎప్పుడు వస్తారు అన్నది వారికి తెలియదు. మనుష్యుల నుండి దేవతలుగా తయారుచేయడానికి భగవంతుడికి ఎంతో సమయం పట్టదు... అని గాయనం కూడా ఉంది. వారు ఎప్పుడు వచ్చి మనుష్యులను దేవతలుగా తయారుచేస్తారు? వారే సర్వులకు సద్గతినిచ్చేవారు, ఇదైతే పక్కా నిశ్చయం ఉండాలి. వారు వచ్చి ఏమంటారు? కేవలం

మన్మనాభవ అని అంటారు. దీని అర్థాన్ని కూడా అర్థం చేయిస్తారు, ఇంకెవ్వరూ దీని అర్థాన్ని అర్థం చేయించరు. సద్గురువైన అకాలమూర్తి కూర్చొని, స్వయాన్ని ఆత్మగా భావించండి అని మీకు ఈ దేహం ద్వారా అర్థం చేయిస్తారు, కావున దీనిని అర్థం చేసుకోవాలి. విశ్వానికి యజమానులుగా తయారుచేయడానికి పిల్లలైన మీ సేవ కోసం తండ్రికి రావలసి ఉంటుంది. వారు అర్థం చేయిస్తారు - ఓ ఆత్మిక పిల్లలూ, మీరు సతోప్రధానంగా ఉండేవారు, మళ్ళీ తమోప్రధానంగా అయిపోయారు. ఈ సృష్టి చక్రం తిరుగుతూ ఉంటుంది కదా. పావన ప్రపంచం అనేది ఈ దేవతలదే ఉండేది. వారందరూ ఎక్కడికి వెళ్ళిపోయారు? ఇది ఎవరికీ తెలియదు. తికమకపడిపోయారు. తండ్రి వచ్చి మిమ్మల్ని వివేకవంతులుగా తయారుచేస్తారు. పిల్లలూ, నేను ఒక్కసారి మాత్రమే వస్తాను, పావన ప్రపంచంలోకి అసలు నేను ఎందుకు రావాలి! అక్కడికైతే కాలుడు రాలేడు. తండ్రి అయితే కాలుడికే కాలుడు. వారికి సత్యయుగంలోకి రావలసిన అవసరమే లేదు. అక్కడికి కాలుడు కూడా రాడు, అలాగే మహాకాలుడు కూడా రారు. వీరు వచ్చి ఆత్మలందరినీ తీసుకువెళ్తారు. సంతోషముగా వెళ్తారు కదా! అవును బాబా, మేము సంతోషంగా వెళ్ళేందుకు సిద్ధంగా ఉన్నాము. అందుకే మిమ్మల్ని పిలిచాము, ఈ పతిత ప్రపంచం నుండి పావన ప్రపంచంలోకి వయా శాంతిధామం తీసుకువెళ్ళండి అని. ఈ విషయాలను ఘడియ-ఘడియ మర్చిపోకండి. కానీ శత్రువైన మాయ నిలబడి ఉంది, అది ఘడియ-ఘడియ మరపింపజేస్తుంది. నేను మాస్టర్ సర్వశక్తివంతుడినైతే మాయ కూడా శక్తివంతమైనది. అది కూడా అర్ధకల్పం మీపై రాజ్యం చేస్తుంది, మరపింపజేస్తుంది, అందుకే ప్రతిరోజు తండ్రి అర్థం చేయించవలసి వస్తుంది, రోజు జాగృతులను చేయకపోతే మాయ ఎంతో నష్టపరుస్తుంది. ఇది పవిత్రులుగా మరియు అపవిత్రులుగా అయ్యే ఆట. మీ నడవడికను సరిదిద్దుకునేందుకు పవిత్రంగా అవ్వండి అని ఇప్పుడు తండ్రి అంటారు. కామ వికారం కోసం ఎన్ని గొడవలు జరుగుతాయి.

ఇప్పుడు మీకు జ్ఞానమనే మూడవ నేత్రం లభించింది కావున ఆత్మనే చూడండి అని తండ్రి అంటారు. ఈ దైహిక నేత్రాలతో అసలు చూడనే చూడకండి. ఆత్మలమైన మనందరము పరస్పరం సోదరులము. వికారాలలోకి ఎలా వెళ్ళాము. మనం అశరీరిగా వచ్చాము, మళ్ళీ అశరీరిగా అయి వెళ్ళాలి. ఆత్మ సతోప్రధానంగా వచ్చింది, సతోప్రధానంగా అయి మధురమైన ఇంటికి వెళ్ళాలి. ముఖ్యమైనది పవిత్రతకు సంబంధించిన విషయమే. రోజు అదే విషయాన్ని అర్థం చేయిస్తున్నారు అని మనుష్యులు అంటారు, అది నిజమే. కానీ ఏదైతే అర్థం చేయించడం జరుగుతుందో, దానిపై నడవాలి కూడా కదా. అలా చేయాలనే అర్థం చేయించడం జరుగుతుంది. కానీ ఎవరైనా అలా నడుచుకుంటున్నారా, అందుకే ప్రతిరోజు అర్థం చేయించవలసి ఉంటుంది. ఇలా ఏమైనా అంటారా - బాబా, మీరు రోజు ఏదైతే అర్థం చేయిస్తున్నారో దానిని మేము బాగా అర్థం చేసుకున్నాము, ఇప్పుడు మేము తమోప్రధానము నుండి సతోప్రధానముగా అయిపోతాము, మీరు ఇక ఫ్రీ అయిపోండి అని. ఇలా ఏమైనా అంటారా? అందుకే బాబాకు రోజు అర్థం చేయించవలసి వస్తుంది. విషయమైతే ఒక్కటే. కానీ చేయడం లేదు కదా. తండ్రిని అసలు స్మృతి చేయనే చేయరు. బాబా, ఘడియ-ఘడియ మర్చిపోతున్నాము అని అంటారు. స్మృతినిప్పించేందుకు తండ్రి ఘడియ-ఘడియ చెప్పవలసి వస్తుంది. మీరు కూడా ఒకరికొకరు ఇదే అర్థం చేయించుకుంటూ ఉండండి - స్వయాన్ని ఆత్మగా భావిస్తూ పరమాత్మను స్మృతి చేసినట్లయితే మీ పాపాలు సమాప్తమైపోతాయి, ఇంకే ఉపాయము లేదు అని. ప్రారంభంలో మరియు అంతిమంలో ఈ విషయాన్నే చెప్తారు. స్మృతితోనే సతోప్రధానంగా అవ్వాలి. బాబా, మాయా తుఫానులు మరపింపజేస్తున్నాయి అని స్వయమే వ్రాస్తారు. మరి తండ్రి అప్రమత్తం చేయవద్దా, వదిలేయాలా? నంబరువారు పురుషార్థానుసారముగా ఉన్నారని తండ్రికి తెలుసు. ఎప్పటివరకైతే సతోప్రధానంగా అవ్వరో, అప్పటివరకు వెళ్ళలేరు. యుద్ధముతో కూడా సంబంధం ఉంది కదా. ఎప్పుడైతే మీరు నంబరువారు పురుషార్థానుసారముగా సతోప్రధానంగా అవుతారో, అప్పుడే యుద్ధం మొదలవుతుంది. జ్ఞానమైతే ఒక్క క్షణానికి సంబంధించినది. అనంతమైన తండ్రిని పొందారు, ఎప్పుడైతే పవిత్రంగా అవుతారో అప్పుడే వారి నుండి అనంతమైన సుఖం లభిస్తుంది. పురుషార్థము బాగా చేయాలి. కొంతమందైతే ఏమీ అర్థం చేసుకోరు. తండ్రిని స్మృతి చేసే తెలివి కూడా ఉండదు. ఈ చదువును ఎప్పుడూ చదవలేదు. మొత్తం చక్రమంతటిలోనూ నిరాకార తండ్రి నుండి ఎవరూ చదువుకోలేదు. కావున ఇది కొత్త విషయం కదా. నేనైతే మిమ్మల్ని సతోప్రధానంగా చేయడానికి ప్రతి 5 వేల సంవత్సరాల తర్వాత వస్తాను అని తండ్రి అంటారు. ఎప్పటివరకైతే సతోప్రధానంగా అవ్వరో అప్పటివరకు ఈ పదవిని పొందలేరు. ఏ విధంగా ఇతర చదువులలో ఫెయిల్ అవుతారో, అదే విధంగా ఇందులో కూడా ఫెయిల్ అవుతారు. శివబాబాను స్మృతి చేయడం ద్వారా ఏమవుతుంది అన్నది ఏమీ అర్థం చేసుకోరు. వారు తండ్రి కనుక తప్పకుండా తండ్రి నుండి స్వర్గ వారసత్వం లభించాలి. తండ్రి ఒక్కసారి మాత్రమే అర్థం చేయిస్తారు, దానితో మీరు దేవతగా అవుతారు. మీరు దేవతగా అవుతారు, తర్వాత పాత్రను అభినయించేందుకు అందరూ నంబరువారుగా వస్తారు. ఈ విషయాలన్నీ వృద్ధ మాతలు మొదలైనవారి బుద్ధిలో

కూర్చోవు. కావున తండ్రి అంటారు, స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయండి. అంతే, ఆ శివబాబాయే ఆత్మలందరికీ తండ్రి. తమ-తమ శారీరక తండ్రి అయితే ప్రతి ఒక్కరికీ ఉన్నారు. శివబాబా అయితే నిరాకారుడు, వారిని స్మృతి చేస్తూ-చేస్తూ పవిత్రంగా అయి శరీరాన్ని వదిలి మళ్ళీ తండ్రి వద్దకు వెళ్ళి చేరుకోవాలి. తండ్రి అయితే ఎంతో అర్థం చేయిస్తారు కానీ అందరూ ఏకరసంగా అర్థం చేసుకోరు. మాయ మరపింపజేస్తుంది. దీనిని యుద్ధము అని అంటారు. తండ్రి కూర్చుని ఎంత బాగా అర్థం చేయిస్తారు. ఎన్ని విషయాల యొక్క స్మృతినిప్పిస్తారు. ముఖ్యమైన పొరపాట్లు ఏవైతే జరిగాయో వాటి లిస్టును తయారుచేయండి. ఒకటి, తండ్రిని సర్వవ్యాపి అని అనడము. భగవానువాచ - నేను సర్వవ్యాపిని కాను. 5 వికారాలే సర్వవ్యాపి, ఇది చాలా పెద్ద పొరపాటు. గీతా భగవానుడు శ్రీకృష్ణుడు కాదు, పరమపిత పరమాత్మ అయిన శివుడు. ఈ పొరపాట్లను సరిదిద్దుకున్నట్లయితే దేవతగా అయిపోతారు. కానీ ఈ పొరపాట్ల కారణంగానే భారత్ పావనము నుండి పతితముగా అయ్యింది అని ఈ విధంగా మేము అర్థం చేయించాము అని ఇలా ఎప్పుడూ పిల్లలెవ్వరూ రాయలేదు. అది కూడా చెప్పవలసి ఉంటుంది. భగవంతుడు సర్వవ్యాపి ఎలా అవ్వగలరు. భగవంతుడైతే ఒక్కరే, వారే సుప్రీమ్ తండ్రి, సుప్రీమ్ టీచరు, సుప్రీమ్ సద్గురువు. ఏ దేహధారిని కూడా సుప్రీమ్ తండ్రి, టీచరు, సద్గురువు అని అనలేరు. శ్రీకృష్ణుడైతే మొత్తం సృష్టి అంతటిలోనూ అందరికన్నా ఉన్నతమైనవారు. సృష్టి ఎప్పుడైతే సతోప్రధానంగా అవుతుందో, అప్పుడు వారు వస్తారు, మళ్ళీ సతోలో రాముడు, ఆ తర్వాత నంబరువారుగా తమ సమయానుసారముగానే వస్తారు. అందరి వికారాలను తీసుకుంటూ-తీసుకుంటూ కంఠము నల్లగా అయిపోయింది అని శాస్త్రాలలో చూపిస్తారు. కానీ ఇప్పుడు అర్థం చేయిస్తూ-అర్థం చేయిస్తూ గొంతే ఎండిపోతుంది. విషయం ఎంత చిన్నది కానీ మాయ ఎంత శక్తివంతమైనది. నేను ఈ విధంగా గుణవంతునిగా, సతోప్రధానముగా అయ్యానా? అని ప్రతి ఒక్కరూ తమ హృదయాన్ని ప్రశ్నించుకోండి.

తండ్రి అర్థం చేయిస్తారు, ఎప్పటివరకైతే వినాశనం జరగదో అప్పటివరకు మీరు కర్మాతీత అవస్థను పొందలేరు. ఎంత కష్టపడినా సరే అది జరగదు. మొత్తం సమయమంతా కూర్చుని శివబాబాను స్మృతి చేయండి, అసలు ఇంకేమీ మాట్లాడకండి, అంతే. బాబా, ఇక యుద్ధానికి ముందే నేను కర్మాతీత అవస్థను పొంది చూపిస్తాను అని ఇలాంటివారు వెలువడడమనేది డ్రామాలో జరగదు. మొదటి నంబరులోకైతే ఒక్కరే వెళ్ళాలి. నేను ఎంతగా కష్టపడవలసి వస్తుంది అని వీరు కూడా అంటారు. మాయ అయితే ఇంకా రుస్తుంలా అయి వస్తుంది. బాబా స్వయంగా అంటారు, నాకైతే అసలు పక్కనే శివబాబా కూర్చుని ఉన్నారు, అయినా కూడా నేను స్మృతి చేయలేకపోతాను, మర్చిపోతాను. నాతో బాబా ఉన్నారు అని భావిస్తాను. అయినా సరే, ఏ విధంగా మీరు స్మృతి చేస్తారో, అలాగే నేను కూడా స్మృతి చేయవలసి ఉంటుంది. నేనైతే వారితోపాటే ఉన్నాను అని ఇందులోనే సంతోషపడిపోవడం కాదు. అలా కాదు, నిరంతరము స్మృతి చేయండి అని నాకు కూడా చెప్తారు. నాతోపాటు ఉన్న నీవు రుస్తుంవు, నీకైతే ఇంకా ఎక్కువ తుఫానులు వస్తాయి. లేదంటే పిల్లలకు ఎలా అర్థం చేయించగలరు. ఈ తుఫానులన్నీ నిన్ను దాటి వెళ్తాయి. నేను వీరికి ఇంత సమీపంగా కూర్చుని ఉన్నా కూడా కర్మాతీత అవస్థను పొందలేకపోతాను అంటే ఇక ఇంకెవరు తయారవుతారు. ఈ గమ్యము చాలా ఉన్నతమైనది. డ్రామానుసారంగా అందరూ పురుషార్థం చేస్తూ ఉంటారు. బాబా, మేము మీ కన్నా ముందే కర్మాతీత అవస్థను పొంది అలా అయ్యి చూపిస్తాము అని ఎవరైనా అటువంటి ప్రయత్నం చేసి చూపిద్దామన్నా అలా అవ్వదు. ఈ డ్రామా తయారై తయారుచేయబడినది.

మీరు ఎంతో పురుషార్థము చేయాలి. ముఖ్యమైన విషయమంతా క్యారెక్టర్స్ కు సంబంధించినది. దేవతల క్యారెక్టర్స్ కు మరియు పతిత మనుష్యుల క్యారెక్టర్స్ కు ఎంత తేడా ఉంది. మిమ్మల్ని వికారుల నుండి నిర్వికారులుగా తయారుచేసేవారు శివబాబా. కావున ఇప్పుడు పురుషార్థం చేసి తండ్రిని స్మృతి చేయవలసి ఉంటుంది. మర్చిపోకండి. ఇకపోతే, అబలలు పాపం పరవశమై ఉన్నారు అనగా రావణుడికి వశమై ఉన్నారు, మరేం చేయగలరు. మీరు రాముడైన ఈశ్వరుడికి వశమై ఉన్నారు. వారు రావణుడికి వశమై ఉన్నారు. కనుక యుద్ధం నడుస్తుంది. అంతేకానీ రాముడు మరియు రావణుడికి యుద్ధం జరగదు. తండ్రి పిల్లలైన మీకు భిన్న-భిన్న రకాలుగా రోజూ అర్థం చేయిస్తారు - మధురాతి-మధురమైన పిల్లలూ, స్వయాన్ని సరిదిద్దుకుంటూ ఉండండి. రోజూ రాత్రివేళ లెక్కాపత్రాన్ని చూసుకోండి, రోజంతటిలో ఎటువంటి ఆసురీ నడవడిక అయితే నడవలేదు కదా? తోటలో పుష్పాలు నంబరువారుగా అయితే తప్పకుండా ఉంటాయి. రెండు పుష్పాలు ఒకే విధముగా ఎప్పుడూ ఉండవు. ఆత్మలందరికీ తమ-తమ పాత్ర లభించి ఉంది. పాత్రధారులు ప్రతి ఒక్కరూ పాత్రను అభినయిస్తూ ఉంటారు. తండ్రి కూడా వచ్చి స్థాపనా కార్యాన్ని చేసి తీరుతారు. ప్రతి 5 వేల సంవత్సరాల తర్వాత వచ్చి విశ్వానికి యజమానులుగా తయారుచేసి తీరుతారు. అనంతమైన

తండ్రి కదా కావున తప్పకుండా కొత్త ప్రపంచం యొక్క వారసత్వాన్ని ఇస్తారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. జ్ఞానమనే మూడవ నేత్రంతో ఆత్మనే చూడాలి. స్థూల నేత్రాలతో అసలు చూడనే చూడకూడదు. అశరీరిగా అయ్యే అభ్యాసం చేయాలి.

2. తండ్రి స్మృతితో తమ దైవీ క్యారెక్టరును తయారుచేసుకోవాలి. మీ హృదయాన్ని ప్రశ్నించుకోవాలి - నేను ఎంతవరకు గుణవంతునిగా అయ్యాను? నేను రోజంతటిలో ఆసురీ నడవడిక అయితే నడుచుకోలేదు కదా?

వరదానము:- సదా కేర్ ఫుల్ గా ఉంటూ మాయ యొక్క రాయల్ రూపం యొక్క నీడ నుండి సురక్షితంగా ఉండే మాయాప్రూఫ్ భవ

వర్తమాన సమయంలో మాయ నిజమైన వివేకాన్ని, రియలైజేషన్ శక్తిని మాయం చేసి రాంగ్ ను రైట్ గా అనుభవం చేయిస్తుంది. ఏ విధంగా ఎవరైనా ఇంద్రజాలం చేసినట్లయితే పరవశులైపోతారో, అదే విధంగా రాయల్ మాయ రియల్ ను (నిజాన్ని) అర్థం చేసుకోనివ్వదు, అందుకే బాప్ దాదా అటెన్షన్ ను డబల్ అండర్ లైన్ చేయిస్తున్నారు. ఎంత కేర్ ఫుల్ గా (జాగ్రత్తగా) ఉండండి అంటే మాయ యొక్క నీడ నుండి సురక్షితంగా, మాయా ప్రూఫ్ గా అయిపోండి. విశేషంగా మనస్సు-బుద్ధిని తండ్రి ఛత్రఛాయ యొక్క ఆధారంలోకి తీసుకురండి.

స్లోగన్:- ఎవరైతే సహజయోగులుగా ఉంటారో, వారిని చూసి ఇతరుల యోగం కూడా సహజంగా జోడించబడుతుంది.